GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 73 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 16 అక్టోబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

### జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా

# ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

జమ్మూకశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం చేశారు.



శ్రీనగర్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూ కశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అతనితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు హాజరయ్యారు.

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫ–రెన్స్– కాంగ్రెస్ కూటమి విజయం సాధించాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ వచ్చింది. ఈ క్రమంలోనే ఎన్సీ శాసనసభాపక్ష నేతగా ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలంటూ ఎన్సీతోపాటు కాంగ్రెస్ నుంచి ఎల్‌కి విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో ఈ రోజు కొత్త ప్రభుత్వ ఏర్పాటు, సీఎం ప్రమాణస్వీకారానికి లెఫ్టినెంట్ గవర్నర్ ఆహ్వానించడంతో ఈ కార్యక్రమం జరిగింది.

### కొనసాగుతున్న ఏపీ క్యాబినెట్ భేటీ..

# క్లీన్ ఎనర్జీ, పారిశ్రామిక పాలసీకి ఆమోదం

ఏపీ క్యాబినెట్ సమావేశం కొనసాగుతోంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షన జరుగుతున్న ఈ భేటీ పలు కీలక అంశాలపై చర్చిస్తున్నారు.

అమరావతి, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ క్యాబినెట్ సమావేశం కొనసాగుతోంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షన జరుగుతున్న ఈ భేటీ పలు కీలక అంశాలపై చర్చిస్తున్నారు. ప్రభుత్వ శాఖలు ఇచ్చిన ప్రతిపాదనలపై చర్చ జరుగుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్లో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు, చెత్త పన్ను రద్దు, ఆలయాల పాలక మండళ్ల నియామకంలో చట్ట సవరణ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, నూతన పారిశ్రామిక విధానం, కొత్త మున్సిపాలిటీల్లో పోస్టుల భర్తీ తదితర అంశాలపై సీఎం, మంత్రులు చర్చిస్తున్నారు.



#### పలు అంశాలకు కేబినెట్ ఆమోదం

ఏపీ క్లీన్ ఎనర్జీకి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024-29 రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి పాలసీ 4.0కు ఆమోదముద్ర వేసింది. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పారిశ్రామిక పాలసీని రూపొందించారు. ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా పాలసీని తీసుకువచ్చారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్పై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చ సాగుతోంది. నూతన ఎంఎస్ఎంఈ పాలసీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2030 నాటికి ఇంటింటికీ పారిశ్రామికవేత్త అంశంతో ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చింది. ఎలక్ట్రానిక్ పరిశ్రమలను ప్రోత్సహించేలా కొత్త పాలసీపై చర్చ సాగింది. మల్లవెల్లి పారిశ్రామిక పార్కులో 349 మందికి భూకేటాయింపులపై మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్ నియంత్రణ, ధరల నియంత్రణపై మంత్రుల కమిటీల నియామకంపై చర్చ సాగుతోంది. ఉద్యోగాల కల్పనపై మంత్రుల కమిటీ నియామకంపైనా చర్చిస్తున్నారు. అమరావతి కేంద్రంగా ఏపీ యాంటీ నార్కోటిక్స్ టాస్కోఫోర్స్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. చెత్తపన్ను రద్దుపైనా క్యాబినెట్ తీర్మానం చేయనుంది.

# సీఎం రేవంత్‌ను కలిసిన దేవిశ్రీప్రసాద్

తెలంగాణ సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కలిశారు.



హైదరాబాద్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ కలిశారు. జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో ఆయనతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ నెల 19న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న మ్యూజిక్ కాన్సర్టు రేవంత్, భట్టివిక్రమార్కను దేవిశ్రీ ప్రసాద్ ఆహ్వానం పలికారు. ఆయనతో పాటు నిర్మాత బండ్ల గణేశ్ ఉన్నారు.

# ఇన్సులిన్ ఇవ్వకపోతే ఆరోజే చనిపోయేవాడిని: కేజ్రీవాల్

గత పదేళ్లుగా ఢిల్లీలో అభివృద్ధి పనులు జరగకుండా భాజపా అడ్డుపడుతోందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అదేవిధంగా తన అరెస్టుకు భాజపానే కారణమని విమర్శించారు.



దిల్లీ, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆయన భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు. జైల్లో ఉన్న తనకు ఇన్సులిన్ ఇవ్వకుండా చంపేందుకు భాజపా కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ మేరకు బుధవారం జనసంపర్క్ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యానించారు. అయితే తిహాడ్ జైలు అధికారవర్గాలు ఈ ఆరోపణలను ఖండించాయి. ఆయనకు అన్ని వైద్యసౌకర్యాలు కల్పించినట్టు స్పష్టం చేశాయి. 'నాకు మధు-మేహం లెవల్స్ పెరగడంతో.. రోజు నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటాను. జైల్లో ఉన్న నేను ఇన్సులిన్ తీసుకోకపోతే కిడ్నీలు పాడైపోయి చనిపోయేలా వాళ్లు (భాజాపాను ఉద్దేశిస్తూ) కుట్రలు పన్నారు. మీ అందరి ఆశీస్సులతో నేను బయటకు వచ్చాను. గత 10 ఏళ్లలో లెఫ్టినెంట్ గవర్నర్ను అడ్డంపెట్టుకుని ఢిల్లీలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు ఆపేందుకు ప్రయత్నించారు. కానీ, నేను వారి ప్రయత్నాలను తిప్పికొట్టాను. ఢిల్లీలో పనులు ఎందుకు ఆపాలనుకుంటున్నారు?. పంజాబ్లో మా పార్టీ విజయం సాధించాక.. దిల్లీలో పనులు ఆపకపోతే దేశవ్యాప్తంగా ఆప్ అధికారంలోకి వస్తుందని భయపడుతున్నారు. నేను జైల్లో ఉండగా దిల్లీ అభివృద్ధి పనులు ఆపేశారు. తిరిగి నేను జైలు నుంచి వచ్చాక మా పార్టీ వాటిని ప్రారంభించింది' అని ఆయన పేర్కొన్నారు. ఇక, తాను దిల్లీ ముఖ్యమంత్రిగా రాజీనామా చేయడానికి గల కారణాలను వివరిస్తూ దిల్లీ ఓటర్లకు కేజీవాల్ లేఖ రాశారు.

### ఐఏఎస్ పిటిషన్ పై

## విచారణ పూర్తి.. తీర్పు రిజర్వు

డీవోపీటీ ఉత్తర్వులపై ఐఏఎస్ అధికారులు వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, సృజన, శివశంకర్, హరికిరణ్ హైకోర్టును ఆశ్రయించారు.



హైదరాబాద్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): డీవోపీటీ ఉత్తర్వులపై ఐఏఎస్ అధికారులు వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, సృజన, శివశంకర్, హరికిరణ్ హైకోర్టును ఆశ్రయించారు. ట్రైబ్యునల్లో నవంబరు 4న విచారణ ఉందని, అప్పటి వరకు రిలీవ్ చేయవద్దని ఐఏఎస్ తరఫు న్యాయవాది కోరారు. స్టే ఇస్తూ పోతే ఈ అంశం ఎన్నటికీ తేలదని ఈ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. వివాదాన్ని తేలుస్తాం.. ముందు కేటాయించిన రాష్ట్రాల్లో చేరాలని సూచించింది. "మీరంతా బాధ్యతాయుతమైన అధికారులు.. ప్రజలకు ఇబ్బంది కలగనీయొద్దు. ఎవరు ఎక్కడ పనిచేయాలనేది కేంద్రం నిర్ణయిస్తుంది. మరోసారి పరిశీలించాలని డీవోపీటీని ఆదేశించమంటారా? "అని ధర్మాసనం అడిగింది. రిలీవ్ చేసేందుకు 15 రోజుల గడువు ఇవ్వాలని రెండు రాష్ట్రాలు డీవోపీటీని కోరాయని ఐఏఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# విమానాలకు బాంబు బెదిరింపులు.. 3 రోజుల్లో 12 ఘటనలు

గడిచిన మూడు రోజులుగా 12 విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది.

దిల్లీ, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): భారత్కు చెందిన పలు విమానాలకు బాంబు బెదిరింపుల ఘటనలు కలకలం రేపుతున్నాయి. మూడు రోజులుగా 12 విమాన సర్వీసులకు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి. తాజాగా ఆకాశ, ఇండిగో ఎయిర్లైన్స్ విమానాలకు బెదిరింపులు వచ్చాయి. దీంతో బెంగళూ-రుకు బయలుదేరిన ఆకాశ విమానాన్ని తిరిగి ఢిల్లీలో అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. మరోవైపు దాదాపు 200 మంది ప్రయాణికులతో వెళ్తున్న ముంబయి-దిల్లీ ఇండిగో విమానానికీ ఇదేవిధమైన బెదిరింపులు రావడంతో ఆ విమానాన్ని అహ్మదాబాద్కు దారి మళ్లించారు.



ఆకాశ ఎయిర్లైన్స్ క్యూపి1335 విమానం 184 మంది ప్రయాణికులతో దిల్లీ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే అత్యవసరంగా ల్యాండింగ్ చేయాలని పైలట్కు ఆదేశాలు వెళ్లాయి. దీంతో వెంటనే ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆకాశ ఎయిర్లైన్స్ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అటు ముంబయి-దిల్లీ విమానం కూడా అహ్మదాబాద్ లో సురక్షితంగా దిగినట్లు సదరు విమానయాన సంస్థ వెల్లడించింది. గడిచిన మూడు రోజులుగా అనేక విమానాలకు బాంబు బెదిరింపులు వస్తోన్న ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఇదే అంశంపై చర్చించేందుకు పార్లమెంటరీ కమిటీ బుధవారం భేటీ అయ్యింది.

#### తీవ్ర ఆందోళనకరం :అమెరికా

భారత్ నుంచి షికాగో, సింగపూర్ వంటి అంతర్జాతీయ విమాన సర్వీసులకూ బాంబు బెదిరింపులు రావడంపై అమెరికా స్పందించింది. ఇది తీవ్ర ఆందోళనకర విషయమని పేర్కొంది. ఇదే అంశంపై అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మ్యాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ.. పౌర విమానాలకు ఈ తరహా బెదిరింపులు రావడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఇటువంటి ఘటనలను తమ భద్రతా విభాగాలు తీవ్రంగా పరిగణిస-్తున్నాయని, వీటిపై అన్ని వేళలా సహకరించుకునేందుకు భారత్-అమెరికా దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు.

# నిత్యం నేర్చుకునే దృక్పథంతోనే నేరాల ఛేదన సాధ్యం: డీజీపీ జితేందర్

నిరంతరం నేర్చుకుంటూ, తప్పులు సరిదిద్దుకుంటూ, జాగ్రత్తలు పాటిస్తేనే నేరాల ఛేదన సాధ్యమవుతుందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు.




హైదరాబాద్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): నిరంతరం నేర్చుకుంటూ, తప్పులు సరిదిద్దుకుంటూ, జాగ్రత్తలు పాటిస్తేనే నేరాల ఛేదన సాధ్యమవుతుందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. రాజేంద్రనగర్లోని పోలీసు అకాడమీలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మొదటి పోలీస్ డ్యూటీ మీటు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో మొదటి పోలీసు డ్యూటీ మీట్ లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం పోలీసుల్లో బృంద స్ఫూర్తిని పెంచుతుందని తెలిపారు. అన్ని కేసులను సాంకేతిక ఆధారాలతో ఛేదించాలని సూచించారు. న్యాయం జరిగితేనే బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం వస్తుందని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. పోలీసు డ్యూటీ మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎస్ శాంతి కుమారి హాజ-రయ్యారు. నేటి నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన 400 మంది పోలీసులు పాల్గొన్నారు. దైనందిన డ్యూటీలో భాగంగా కేసుల విచారణలు, మెలకువలపై ఇక్కడ పోటీలు ఏర్పాటు చేశా-రు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్నెస్ తదితరాలపై పోటీలున్నాయి. కేసుల ఛేదన, ఆధారాల సేకరణపై ఉన్నతాధికారులు సూచనలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్ భగవత్, శిఖా గోయల్ సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉచిత ఇసుక విధానంపై ఫిర్యాదులు.. సీఎం చంద్రబాబు ఆగ్రహం

ఎన్డీయే ప్రభుత్వం ఉచిత ఇసుక లక్ష్యం నెరవేరి తీరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు.

అమరావతి, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): ఎన్డీయే ప్రభుత్వం ఉచిత ఇసుక లక్ష్యం నెరవేరి తీరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు. కేబినెట్ సమావేశం అనంతరం ఉచిత ఇసుక విధానంపై అమాత్యులతో ఆయన కీలకంగా చర్చించారు.



ఉచిత ఇసుక విధానం ఫిర్యాదులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం.. 10 రోజుల్లో మార్పు రాకుంటే ఉపేక్షించనని స్పష్టం చేశారు. ఏ స్థాయిలో తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇసుక విరివిగా దొరకాలన్నారు. అన్ని బంధనాలు తొలగించి, రవాణా, తవ్వకం ఛార్జీలు కూడా వీలైనంత తక్కువ ధర ఉండేలా చర్యలు తీసుకుంటూ ఉచిత ఇసుక అందించి తీరాలని తేల్చి చెప్పారు. ఇసుక తవ్వకుని తీసుకెళ్తే రుస-ుము వసూలు చేయవద్దని సీఎం ఆదేశించారు. ఇసుక అక్రమాలు జరగకుండా ఇన్చార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## వైకాపా నేత సజ్జలకు మంగళగిరి పోలీసుల నోటీసులు

వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు.



ఏఎస్‌యూ, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు విచారణకు హాజరుకావాలని స్పష్టం చేశారు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. దీనిపై కేసు నమోదు కావడంతో ఇప్పటికే పలువురు వైకాపా నేతలను పోలీసులు విచారించారు. ఈ కేసులో సజ్జల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు ఆయన విదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్అవుట్ నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్లను ఇప్పటికే పలు దఫాలుగా పీఎస్కు పిలిపించి విచారించారు. కేసు కొలిక్కి వస్తున్న నేపథ్యంలో దాడి ఘటనలో ప్రమేయం ఉన్న ముఖ్య నాయకులను విచారించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సజ్జలకు నోటీసులు జారీ చేశారు

## బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టేందుకే హైడ్రా :కేటీఆర్

కూకట్పల్లిలో 1980లో కాంగ్రెస్ ప్రభుత్వమే 20 వేల మందికి పట్టాలు ఇచ్చిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.



హైదరాబాద్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): కూకట్పల్లిలో 1980లో కాంగ్రెస్ ప్రభుత్వమే 20 వేల మందికి పట్టాలు ఇచ్చిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అవే ఇళ్లను ఇప్పుడు ఆక్రమణలని అంటున్నారని విమర్శించారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు అండగా ఉంటామని.. రక్షణ కవచంలా నిలుస్తామన్నారు. రేవంత్రెడ్డి పంపే బుల్డోజర్లకు తాము అడ్డంగా నిలబడతామని చెప్పారు. హైదరాబాద్లో ఎస్టీపీలు(మురుగు నీటి శుద్ధి కేంద్రాలు), ఎస్ఎన్డీపీ పనులను పరిశీలిస్తామని పేర్కొన్నారు. "బస్తీల్లోకి వెళ్లి భరోసా కల్పిస్తాం.. లీగల్ సెల్ ద్వారా అండగా ఉంటాం. హైడ్రా వసూళ్లతోనే నాంపల్లిలో కాంగ్రెస్, మజ్లిస్ నేతల గొడవ జరిగింది. రాడార్ స్టేషన్తో స్థానికులకు ఒక్క ఉద్యోగం కూడా రాదు. పర్యావరణానికి నష్టం కలిగించే ప్రాజెక్టుకు అనుమతి ఎలా ఇస్తారు? మూసీ సుందరీకరణకు రూ. లక్షా 50 వేల కోట్లు ఎలా తెస్తారు? ప్రభుత్వ అనాలోచిత విధానాలతోనే పేదలకు ఇబ్బందులు. సరైన ప్రణాళిక లేకుండా ఇష్టం వచ్చినట్లు ముందుకెళుతున్నారు. మూసీ విషయంలో రోజుకోమాట మాట్లాడుతున్నారు. దీని పరిధిలోని పేదల ఇళ్లు కూలుస్తామని అంటున్నారు. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టేందుకు హైడ్రాను తీసుకొచ్చారు. మూసీ పేరుతో జరుగుతున్న దోపిడీని ప్రజల్లోకి తీసుకెళ్తాం. మురుగునీటి శుద్ధి కేంద్రాలను వంద శాతం మేమే పూర్తిచేశాం" అని కేటీఆర్ తెలిపారు.

## 20 సార్లు హత్యాయత్నాలను ఎదుర్కొని..
## మహిళా మంత్రిగా బాధ్యతలు చేపట్టి..!

నేడు కొలువుదీరిన జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో సకీనా ఈటూ కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఇంతకీ ఆమె స్టోరీ ఏంటంటే..?

శ్రీనగర్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్ ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేయగా.. ఆయనతో పాటు ప్రమాణం చేసిన మంత్రుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. ఆమె సకీనా ఈటూ. సకీనా.. దక్షిణ కశ్మీర్కు చెందిన కుల్గామ్ జిల్లాలోని డీహెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆమె పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్ పై 17,449 ఓట్ల మెజార్టీతో గెలుపు దక్కించుకున్నారు. ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నేషనల్ కాన్ఫరెన్స్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ.. ఈ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ స్పీకర్గా పనిచేశారు. ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందుకొని ముందుకు సాగుతోన్న ఆమె సోదరుడిని 2001లో ఉగ్రవాదులు బలిగొన్నారు. అప్పుడు ఆమె వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. తండ్రి, సోదరుడి మరణాలతో వెనకడుగు వేయని ఆమె రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఆమెపై కూడా 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి. వాటన్నింటిని దాటుకొని.. జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు సామాజిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల వయసులో తాజాగా కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూకశ్మీర్ లో ప్రజాదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో ఈమె ఒకరు. సామాజిక సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు.



### జమ్ము ప్రజల వాయిస్ కోసమే..

జమ్ములోని నౌషేరా నుంచి ఎన్నికైన సురిందర్ చౌధరీ ఈ రోజు డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్ము ప్రాంతం ప్రజల గళాన్ని వినిపించేందుకు ఆయన్ను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. "ఈ ప్రభుత్వంలో తమకు ప్రాతినిధ్యం వహించేవారు లేరని జమ్ము ప్రజలు బాధపడాల్సిన పనిలేదు. ఆ ప్రాంతం నుంచి ఉపముఖ్యమంత్రిని ఎంపిక చేశాను. దీంతో ఈ ప్రభుత్వం తమదని జమ్ము ప్రజలు భావిస్తారు" అని సీఎం అన్నారు.

## రంగును బట్టి పార్టీని ఎలా డిసైడ్ చేస్తారు?: ఏపీ హైకోర్టు

● అన్న క్యాంటీన్లకు తెదేపా రంగులు వేస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.




అమరావతి, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): అన్న క్యాంటీన్లకు తెదేపా రంగులు వేస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గతంలో గ్రామసచివాలయాలకు బ్లూ కలర్ తొలగించాలని తీర్పు ఇచ్చిన విషయాన్ని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రంగును బట్టి పార్టీని ఎలా డిసైడ్ చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. అన్నా క్యాంటీన్కు ఇంతకుముందు ఏ రంగులు వేశారని అడిగింది. అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

## రేణిగుంట రన్వేపై నీరు..
## ఇండిగో విమానం దారి మళ్లింపు

● తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రేణిగుంట రన్వేపైకి నీరు చేరింది.

రేణిగుంట, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రేణిగుంట రన్వేపైకి నీరు చేరింది. దీంతో ల్యాండింగ్ సమస్య తలెత్తి ఇండిగో విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. ఈ విమానం హైదరాబాద్ నుంచి రేణిగుంటకు రావాల్సి ఉంది.



## అర్ధరాత్రి యువతిపై అత్యాచారం..
## పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్

గచ్చిబౌలి వద్ద జరిగిన అత్యాచారం కేసులో పోలీసులు పురోగతి సాధించారు.



హైదరాబాద్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): గచ్చిబౌలి ఠాణా పరిధిలో అర్ధరాత్రి యువతిపై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆటోడ్రైవర్ ప్రవీణ్ను లింగంపల్లి పరిధిలోని గోపీనగర్లో అదుపులోకి తీసుకున్నారు. సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ నంబర్ ఆధారంగా కేసును ఛేదించారు. నిందితుడి స్వగ్రామం నల్గొండ జిల్లా కేతిపల్లిగా గుర్తించారు. చెన్నైకి చెందిన యువతి(32) గచ్చిబౌలిలోని నానక్ రాంగూడలో నివాసం ఉంటున్నారు. ఆమె ఓ ప్రైవేటు సంస్థలో ఆర్కిటెక్ట్ పనిచేస్తున్నారు. ఇటీవల దసరా సెలవుల నేపథ్యంలో సొంతూరు వెళ్లిన యువతి సోమవారం అర్ధరాత్రి బస్సులో నగరానికి చేరుకున్నారు. నగర శివారు రామచంద్రాపురం దగ్గర రాత్రి 1.30 గంటలకు బస్సు దిగాక నానక్రాంగూడ వెళ్లేందుకు ఒక ఆటో ఎక్కారు. ఇంటికి వెళ్లేమార్గంలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన రోడ్డులో ఉన్న మసీద్బండ కమాన్ వద్దకు రాగానే జనసంచారం లేకపోవడం చూసి డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. యువతి ప్రశ్నించేలోపే వెనుక సీటులోకి వచ్చాడు. ఆమె నోరునొక్కి దాడి చేశాడు. అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించగా మరోసారి దాడి చేశాడు. దీంతో తలకు గాయమైంది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో దారిన వెళుతున్న ఫుడ్ డెలివరీ బాయ్స్ గమనించి ఆటో దగ్గరికి వచ్చారు. ఈలోపు అతను యువతిని కిందకు తోసేసి వెంటనే పారిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువతిని భరోసా కేంద్రానికి తరలించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## తిరుమల ఘాట్రోడ్డులో
## విరిగిపడిన కొండచరియలు

● వర్షాల కారణంగా తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో స్వల్పంగా బండరాళ్లు రోడ్డుపైకి వచ్చాయి.



తిరుమల, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): వర్షాల కారణంగా తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో స్వల్పంగా బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. జేసీబీల ద్వారా సిబ్బంది వాటిని తొలగిస్తున్నారు. ట్రాఫిక్కు అంతరాయం లేకుండా తితిదే ముందస్తు చర్యలు చేపట్టింది. శ్రీవారి పాదాలు, ఆకాశ గంగ, జాపాలి, పాపవినాశనానికి భక్తులను తితిదే అనుమతించడం లేదు. ఇప్పటికే తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దుచేశారు. వర్షాల కారణంగా భక్తుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల గిరుల్లో వర్షాలతో మాల్వాడిగుండం భారీగా ప్రవహిస్తోంది. కొండల నుంచి వస్తున్న నీటితో తిరుపతి కాలనీల్లోకి వరద వచ్చి చేరుతోంది. రాజీవ్ గాంధీ కాలనీ, ఆటోనగర్, కొరమీనుగుంటలో వరద వస్తోంది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద సీత కాల్వ కాజ్వేపై వరద ప్రవహిస్తోంది. వర్షాల కారణంగా జిల్లా కలెక్టరేట్తో పాటు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్రూమ్లు ఏర్పాటు చేశారు. గూడూరు సబ్కలెక్టరేట్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని తీరప్రాంతాల్లో, వాకాడు, తడ, కోట, సూళ్లూరుపేట, చిల్లకూరులో వర్షం కురుస్తోంది.

## డ్రైవర్కు గుండెపోటు...
## పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

డ్రైవరు గుండెపోటు రావడంతో ఆర్టీసీ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. బాపట్ల జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది.






బాపట్ల, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): డ్రైవర్కు గుండెపోటు రావడంతో ఆర్టీసీ బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. బాపట్ల జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు రేపల్లె నుంచి చీరాల వెళ్తుండగా కర్లపాలెం వద్ద డ్రైవర్ సాంబశివరావుకు గుండెపోటు వచ్చింది. బస్సు వేగాన్ని తగ్గించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ మాత్రం మృతిచెందారు. బస్సు అదుపుతప్పే సమయంలో సైకిల్ను ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు.

## హైకోర్టులో ఐఏఎస్ అధికారుల లంచ్ మోషన్ పిటిషన్

● ఇటీవల డీవోపీటీ బదిలీ చేసిన ఐఏఎస్ అధికారులు తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.



హైదరాబాద్, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): ఇటీవల డీవోపీటీ బదిలీ చేసిన ఐఏఎస్ అధికారులు తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. రొనాల్డ్ రోస్, సృజన, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్.. డీవోపీటీ ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల వీరంతా తమను యథావిధిగా బదిలీ చేయకుండా ఉంచాలని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) ఆశ్రయించారు. వారి విజ్ఞప్తిని అక్కడ నిరాకరించడంతో తాజాగా బుధవారం హైకోర్టులో పిటిషన్ వేసి అత్యవసరంగా విచారించాలని కోరారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ చేపడతామని ఉన్నత న్యాయస్థానం తెలిపింది.

## నాగార్జున సాగర్ 4 గేట్లు ఎత్తి నీటి విడుదల

ఎగువన కురుస్తున్న వర్షాలతో నాగార్జునసాగర్కు వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



నల్గొండ, అక్టోబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): ఎగువన కురుస్తున్న వర్షాలతో నాగార్జునసాగర్కు వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లు ఐదు అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా 32,400 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 76,555 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుత, పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులుగా నమోదైంది. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ కూడా 312.0450 టీఎంసీలుగా ఉంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- ప్రపంచ ఆహార దినోత్సవం. (చిత్రంలో) ప్రపంచ అనస్థీషియా దినోత్సవం
- **1846:** వైద్యరంగంలో మొట్టమొదటిసారిగా మత్తుమందు (ఎనెస్థీసియా) ను ఉపయోగించారు.
- **1854:** ఐర్లండుకు చెందిన కవి,రచయిత ఆస్కార్ వైల్డ్ జననం (మ.1900).
- **1905:** బ్రిటిషు వారు బెంగాల్ రాష్ట్రాన్ని తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాల్‌గా విభజించారు.
- **1958:** తెలుగు రచయిత, అభ్యుదయ కవి, కథారచయిత, నాటకకర్త తెన్నేటి సూరి మరణం (జ.1911).
- **1977:** ఒక అమెరికన్ వాద్యకారుడు జాన్ మేయర్ జననం.
- **1982:** భారతీయ చిత్ర నటుడు, నేపథ్య గాయకుడు, నిర్మాత పృథ్వీరాజ్ సుకుమారన్ జననం.


ఆహార దినోత్సవం


ఎనస్థీసియా


ఆస్కార్ వైల్డ్


పశ్చిమ బెంగాల్


తెన్నేటి సూరి


జాన్ మేయర్


పృథ్వీరాజ సుకుమారన

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## బెంగళూరులో వర్షం.. భారత్ – కివీస్ తొలి టెస్టు మొదటి సెషన్ ఆట కష్టమే!

భారత్, న్యూజిలాండ్ తొలి టెస్టుకు వరుణుడు అడ్డంకిగా మారాడు. బెంగళూరులో ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాల కారణంగా మ్యాచ్ ప్రారంభమయ్యేందుకు ఆలస్యమవుతోంది.

టీ20 సిరీస్లో తో అభిమానులను అలరించిన టీమ్ ఇండియా మరో టెస్టు సిరీసు సిద్ధమైంది. అయితే, వర్షం మాత్రం మ్యాచ్కు ఇబ్బందిపెట్టడం ఫ్యాన్స్ను నిరాశకు గురిచేస్తోంది. భారత్ – న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టెస్టుకు వరుణుడు ఆటంకం కలిగిస్తున్నాడు. బెంగళూరు వేదికగా ప్రారంభం కావాల్సిన మ్యాచ్ ఆలస్యం కానుంది. వర్షం పడుతుండటంతో టాస్ వేయడం సాధ్యం కాలేదు. ఒకవేళ ఇప్పటికిప్పుడు వర్షం ఆగినా మైదానాన్ని సిద్ధం చేసేందుకు కనీసం అరగంట నుంచి గంట సమయ పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతనే టాస్ వేస్తారు. టాస్ వేసిన తర్వాత ఆట ప్రారంభం కావడానికి కనీసం 15 నుంచి 30 నిమిషాల సమయం పట్టనుంది. దీంతో తొలి రోజు మొదటి సెషన్ ఆట సాధ్యపడటం దాదాపు కష్టమేనని క్రికెట్ విశ్లేషకుల అంచనా.



### అత్యాధునిక టెక్నాలజీతో..


ఎంత భారీ వర్షం పడినా మ్యాచ్ను సిద్ధం చేయగల టెక్నాలజీ బెంగళూరు మైదానంలో ఉంది. నిమిషానికి పదివేల లీటర్ల నీటిని పీల్చేయగల సామర్థ్యం కలిగిన సబ్ ఎయిర్ సిస్టమ్ ఇక్కడ ఉంది. దీంతో వర్షం ఆగిన కాసేపటికే పిచ్తోపాటు మైదానం చిత్తడిగా లేకుండా చేసేందుకు వీలుంది. అయితే, గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కొనసాగితే మాత్రం తొలి రోజు ఆటను చూసే అవకాశం ఉండకపోవచ్చు.

### సబ్ ఎయిర్ సిస్టమ్ ఏం చేస్తుందంటే?

కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ దాదాపు పదేళ్ల నుంచి సబ్ ఎయిర్సిస్టమ్ను వినియోగిస్తోంది. తొలిసారి 2015 లో భారత్– దక్షిణాఫ్రికా టెస్టు మ్యాచ్ కోసం ఈ పద్ధతిని తీసుకొచ్చింది. పిచ్తోపాటు, మైదానంలోని పచ్చిక కింద వివిధ లేయర్లలో ఇసుకను వాడారు. మిగతా మైదానాల్లో ఎక్కువగా మట్టిని నింపుతారు. ఇక్కడ ఇసుక ఉండటం వల్ల నీరు మైదానంలో ఉండకుండా మెషిన్ స్టార్ట్ చేయగానే బయటకు వచ్చేస్తుంది. అందుకోసం 200 హార్స్పవర్ యంత్రాలతో సచ్ఎయిర్ సిస్టమ్ రన్ అవుతుంది. అక్కడినుంచి నీటిని డ్రైనేజ్ ల ద్వారా బయటకు పంపిస్తారు. ఆ తర్వాత డ్రయర్లు, రోప్స్ గ్రౌండ్ను రెడీ చేసేస్తారు.

## 'అఖండ 2' షురూ.. పూజా కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణ కుమార్తెలు

బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'అఖండ 2'. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది.




బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'అఖండ 2 తాండవం'. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్లో వేడుకగా జరిగింది. చిత్రబృందంతోపాటు బాలకృష్ణ కుమార్తెలు నారా బ్రాహ్మణి, తేజస్విని, ఇతర కుటుంబసభ్యులు ఈ వేడుకలో సందడి చేశారు. చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. ముహూర్తపు షాట్కు బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో సినిమా కోసం తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' భారీ విజయాన్ని అందుకున్నాయి. 2021లో ప్రేక్షకుల ముందుకొచ్చిన 'అఖండ' బాలయ్య కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్ల జాబితాలో చేరింది. ఇందులో బాలయ్య ద్విపాత్రాభినయంలో ఆకట్టుకున్నారు. ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకులంతా ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్నారు. 'అఖండ 2' అద్భుతంగా ఉంటుందని ఇప్పటికే బోయపాటి పలు సందర్భాల్లో తెలియజేశారు. ఈనేపథ్యంలోనే తాజాగా 'అఖండ 2 తాండవం'ను ప్రకటించారు. ప్రగ్యాజైస్వాల్ కీలకపాత్రలో కనిపించనున్నారు. తమన్ స్వరాలు అందించనున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై నిర్మితం కానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

## కుటుంబ సభ్యులంతా నటులే.. ఇదే చివరిది అనుకుంటూ: పృథ్వీరాజ్ సుకుమారన్ విశేషాలివీ!

మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆయన గురించి పలు ఆసక్తికర విశేషాలివీ..



'సలార్'తో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. అందులో ప్రభాస్ స్నేహితుడిగా, వరద రాజమన్నార్ నటించి విశేషంగా అలరించారు. నేడు పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు (42వ).

### సినీ కుటుంబం..

కేరళలో పుట్టి పెరిగిన పృథ్వీరాజ్ సినీ నేపథ్య కుటుంబం. తండ్రి పరమేశ్వరన్ సుకుమారన్, తల్లి మల్లిక, అన్నయ్య ఇంద్రజిత్, వదిన పూర్ణిమ.. అందరూ నటులే కావడంతో పృథ్వీ చిత్ర పరిశ్రమలోకి రాకుండా మరో రంగంలో స్థిరపడాలనుకున్నారు. ఆ మేరకు ఉన్నత చదువు కోసం ఆస్ట్రేలియా వెళ్లారు. అక్కడ ఉన్నప్పుడే దర్శకుడు రంజిత్ నుంచి ఓ సినిమాకి సంబంధించి ఆడిషన్ కోసం పిలుపు రావడంతో సరదాగా స్క్రీన్టెస్ట్కు హాజరయ్యారు. తాను అనుకున్న హీరో పాత్రకు పృథ్వీ సరిపోతారనిపించడంతో డైరెక్టర్ ఆయన్ను ఎంపిక చేసుకున్నారు. అలా తొలిసారి 'నందనం' సినిమాలో నటించారు. కానీ, అది ఆయన నటించిన రెండు చిత్రాల తర్వాత విడుదలైంది.

### ప్రేమ పెళ్లి

ఈ నటుడి భార్య పేరు సుప్రియా మేనన్. ఒకప్పుడు ఆమె జర్నలిస్టు. ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసి, పెళ్లి పీటలెక్కించింది. సతీమణి వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని గర్వంగా చెబుతుంటారు పృథ్వీ. వీరికో పాప. పేరు అలంకృతా మేనన్ సుకుమారన్. భార్యపై ప్రేమ వల్లే మేనన్ జోడించారు.

### అయిష్టంగానే..!

ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో సెట్లో ఉన్నంతసేపూ ఆయనకు చాలా బోరింగ్గా అనిపించేదట. దాంతో ఏదైనా సినిమా అంగీకరించేముందు.. 'ఇదే చివరిది. దీన్ని పూర్తిచేశాక ఆస్ట్రేలియా వెళ్లిపోవాలి' అని అనుకునేవాడినని ఓ సందర్భంలో తెలిపారు పృథ్వీ. అలా అనుకుంటూనే పలు సినిమాలు పూర్తి చేయడంతో.. క్రమంగా అదే తన ప్రపంచంగా మారిపోయింది. రోజులు గడిచేకొద్దీ దర్శకత్వం (లూసిఫర్, బ్రో డాడీ), నిర్మాణం, యాక్షన్ కొరియోగ్రఫీ వంటి విభాగాల్లోనూ సత్తా చాటారు. సింగర్, నరేటర్గానూ అలరించారు. ఈ వేసవిలో విడుదలైన 'ఆడుజీవితం'లో నజీబ్ కనిపించి, ప్రేక్షకుల హృదయాన్ని హత్తుకున్నారు. ప్రస్తుతం 'ఎల్ 2: ఎంపురన్' సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.

### చిరంజీవి ఆఫర్ల తిరస్కరణ

తాను హీరోగా నటించిన 'సైరా'లో ఓ కీలక పాత్ర పోషించమని పృథ్వీని చిరంజీవి అడగ్గా.. 'ఆడుజీవితం' సినిమా పనుల్లో బిజీగా ఉండడంతో ఆయన చేయలేనని చెప్పారు. తర్వాత, 'లూసిఫర్ను తెలుగులో రీమేక్ చేయమని చిరంజీవి కోరగా.. అప్పుడూ అదే సమాధానం ఇచ్చారు. దాన్ని బట్టి 'ఆడుజీవితం'పై ఆయనెంత శ్రద్ధ పెట్టారో, దాని కోసం ఎంత కష్టపడ్డారో అర్థం చేసుకోవచ్చు.

### సరదాలు..

ఈ హీరోకి ప్రయాణాలంటే చాలా ఇష్టం. అందమైన లొకేషన్లను ఫొటోలు తీయడం అలవాటు. ఇండస్ట్రీలోకి రాకపోయుంటే ట్రావెల్ వ్లాగర్ అయ్యేవాడినని ఓ సందర్భంలో చెప్పారు. విలాసవంతమైన కార్లు, ద్విచక్రవాహనాలు కొంటుంటారు.

## గౌతమ్ తిన్ననూరి కొత్త సినిమా.. టైటిల్ ఏంటో 3..?

'జెర్సీ'తో ప్రేక్షకుల మది గెలుచుకున్నారు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. తాజాగా ఆయన కొత్త సినిమా టైటిల్ అనౌన్స్ చేశారు.




'జెర్సీ'తో ప్రేక్షకుల మది గెలుచుకున్నారు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. 2019లో విడుదలైన ఈ సినిమాతో దర్శకుడిగా ఆయన మంచి పేరు సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇది చిత్రీకరణ దశలో ఉండగానే.. ఆయన మరో ప్రాజెక్ట్ ప్రకటించారు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై ఇది రూపుదిద్దుకోనుంది. నూతన నటీనటులతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మ్యాజిక్ అనే టైటిల్ ఫిక్స్ చేశారు. అనిరుధ్ స్వరాలు అందించనున్నారు. నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. బుధవారం అనిరుధ్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర నిర్మాణసంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ సినిమా టైటిల్ పోస్టర్ షేర్ చేసింది. డిసెంబర్ 21న ఇది విడుదల కానుందని ప్రకటించింది.

## హోమ్ డెకరేషన్

## దీపావళి రోజున ఇంటి గోడల్ని మెరిపించే చిట్కాలు.. పెయింటింగ్‌తో పనిలేదు..

దీపావళికి నెల రోజుల ముందు నుంచే ఇంటి అలంకరణ పనులు ప్రారంభమవుతాయి. అయితే, చాలా మంది ఇంటికి పెయింటింగ్ వేయిస్తారు. అయితే, ఇది కొంచెం బడ్జెట్‌తో కూడుకున్న పని. అయితే, కొన్ని చిట్కాలతో మీ గోడలకు సరికొత్త రూపం ఇవ్వచ్చు.

ప్రతి ఒక్కరూ తమ ఇల్లు అందంగా, ఆకర్షణీయంగా ఉండాలని కోరుకుంటారు. ముఖ్యంగా పండుగల సందర్భంగా ఇంటిని ప్రత్యేకంగా అలంకరించుకుంటారు. త్వరలో దీపావళి వస్తుంది. దీపావళి పండుగ అంటేనే వెలుగులు. అందుకే ఈ వెలుగుల పండుగ సమయంలో తమ ఇల్లు కూడా మెరిసిపోవాలని చాలా మంది కోరుకుంటారు. అందుకే దీపావళి సమయంలో తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటారు. ఇంట్లోని ప్రతి వస్తువు కూడా కొత్త దానిలా మెరిసిపోవాలని భావిస్తారు. ఇక, దీపావళికి చాలా మంది బంధువుల్ని ఇంటికి పిలుస్తుంటాం. చిన్న చిన్న పార్టీలు చేసుకుంటాం. బంధువులు, స్నేహితుల చూడగానే మన ఇల్లు సూపర్‌గా ఉంది అనిపించేలా ఉండాలని కోరుకుంటాం. అందుకే చాలా మంది దీపావళి రోజు కోసం పెయింట్ చేస్తారు. తమ పాత గోడల్ని కొత్తగా కనిపించడం కోసం ఖరీదైన పెయింట్స్ వాడతారు. ఇంట్లో పిల్లలు ఉంటే గోడల్ని పాడుచేస్తారు. అందుకే గోడలకు రంగులు వేయిస్తారు. అయితే, ఇది బడ్జెట్‌తో కూడుకున్న పని. భారీగానే ఖర్చవుతుంది. కొందరి బడ్జెట్ దాటిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక చాలా మంది సతమతవవుతుంటారు. అయితే.. పెయింటింగ్ అవసరం లేకుండా మీ గోడల్ని అందంగా మార్చుకునే కొన్ని చిట్కాలు ఉన్నాయి. ఆ చిట్కాలు ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.



### గోడల్ని ఇలా క్లీన్ చేసుకోండి..



గోడల్ని శుభ్రం చేయడానికి చాలా మంది వాటిని నీటితో కడుగుతుంటారు. అయితే, ఇది చాలా పెద్ద తప్పు. నీటితో కడగడం వల్ల గోడలపై మరింత మురికి పేరుకుపోతుంది. ఇంటి గోడలను శుభ్రపరిచేటప్పుడు ముందుగా పొడి గుడ్డ లేదా చీపురు సహాయంతో ముందుగా క్లీన్ చేసుకోవాలి. దుమ్ము, ధూళి లేదా బూజు వంటి అన్ని పొడి చెత్తలను చీపురు లేదా పొడి గుడ్డతో శుభ్రం చేయండి. అయితే, దుమ్ము.. బూజు దులిపే సమయంలో కొన్ని ప్రాథమిక విషయాలను గుర్తుంచుకోండి. లేదంటే మీ పని మరింత కష్టమవుతుంది. గోడల్ని క్లీన్ చేసే ముందు ముందుగా ఫ్యాన్ ఆఫ్ చేయండి. ఆ తర్వాత ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌ని ఏదైనా గుడ్డతో కప్పండి. ఇలా చేయడం వల్ల మిగతా ప్రాంతాల్లో ఎక్కువగా దుమ్ము వ్యాపించదు.

### మరకల పని ఇలా పట్టండి..

ఇంట్లో పిల్లలు ఉంటే.. వారు గోడలపై తమ ప్రతాపం చూపిస్తుంటారు. పెన్నులు, పెన్సిల్స్‌తో పిచ్చి పిచ్చి గీతలు, రాతలు రాస్తుంటారు. అంతేకాకుండా నూనె మరకలు, మసాల మరకలు గోడలపై పడుతుంటాయి. ఇవి జిడ్డుగా ఉండటం వల్ల వదిలించుకోవడం కొంచెం కష్టంగా ఉంటుంది. అయితే, వీటిని తొలిగించడానికి ఓ మ్యాజిక్ సొల్యూషన్ ఇక్కడ రెడీ చేసుకుందాం. ఇందు కోసం మీరు వెనిగర్‌ని గోరువెచ్చని నీటిలో కలపాలి. అంతేకాకుండా డిష్ వాషర్ లిక్విడ్, నిమ్మకాయ కూడా దీనికి జోడించండి. గోడలపై జిడ్డు ఎక్కువగా ఉంటే నీటిని కొంచెం ఎక్కువగా వేడిగా ఉండేలా చూసుకోండి. అంతేకాకుండా నిమ్మరసం ఎక్కువ కలపండి. ఇప్పుడు ఈ క్లీనింగ్ సొల్యూషన్‌లో మెత్తని స్పాంజ్ని ముంచి గోడలను సున్నితంగా రుద్దండి. సుమారు 20 నిమిషాల పాటు వాటిని ఇలాగే రుద్దండి. ఆ తర్వాత శుభ్రమైన నీటి సహాయంతో గోడల్ని క్లీన్ చేయండి. ఇలా చేయడం వల్ల మీ గోడలు మెరుస్తాయి.



### వాల్ పేపర్స్ యూజ్ చేయండి..

ఇంటి గోడలు చాలా మురికిగా మారినట్లయితే వాటిని శుభ్రం చేసిన ఏ ప్రయోజనం ఉండదు. అంతేకాకుండా గోడలు మసకబారినట్టు కనిపించితే.. క్లీన్ చేసినా మరకలు పోవు. అప్పుడు పెయింటింగ్ బదులు మోడ్రల్ లుక్ కోసం వాల్ పేపర్స్ వాడవచ్చు. ఇందుకోసం మీరు చేయాల్సిందల్లా ఆన్లైన్ లేదా మార్కెట్ నుంచి కొన్ని వాల్పేపర్ స్టిక్కర్లను ఆర్డర్ చేయండి. వాటిని గోడలపై అతికించడం చాలా సులభం. అంతేకాకుండా వాల్ పేపర్స్ వివిధ రంగులు, డిజైన్లలో మార్కెట్‌లో లభిస్తాయి. పండుగకు ముందే మంచి వాల్ పేపర్లను కొనుగోలు చేయండి. ఇంకేముంది తక్కువ బడ్జెట్‌లో మీ గోడలకు డిజైనర్ రూపాన్ని ఇవ్వండి.

### వీటిని ట్రై చేయండి..

**బేకింగ్ సోడా..**




వంటగది గోడలపై ఆయిల్ మరకలు ఎక్కువగా పడతాయి. వీటిని వదిలించుకోవడం కొంచెం కష్టం. గోడపై ఉన్న జిడ్డు మరకలను తొలగించడానికి బేకింగ్ సోడా బెస్ట్ ఆప్షన్. ముందుగా బేకింగ్ సోడాను నీటితో కలిపి ఓ పేస్ట్‌లా తయారు చేసుకోండి. ఆ తర్వాత మరక ఉన్న ప్రదేశాల్లో అప్లై చేయండి. ఆ తర్వాత 15 –20 నిమిషాలు పాటు ఆరనివ్వాలి. ఇలా చేసిన తర్వాత శుభ్రమైన బట్టను నీటిలో ముంచి ఆ ప్రదేశంలో తుడవండి. దీంతో.. నూనె మరకలు తొలిగిపోతాయి.

### ఐరన్ బాక్స్..



గోడపై నూనె మరకలు ఎక్కువగా ఉంటే.. వాటిపై ఐరన్ బాక్స్, హెయిర్ డ్రైయర్ ఉంచి తొలగించవచ్చు. అందుకోసం ముందు మీరు గోడపై మరకలున్న చోట కాగితాన్ని ఉంచండి. దాని మీద ఐరన్ బాక్స్ లేదా హెయిర్ డ్రైయర్ ఉంచండి. ఇలా చేయడం వల్ల వాటి నుంచి వచ్చే వేడితో పేరుకుపోయిన జిడ్డు మరకలు కరిగిపోతాయి. దీంతో నూనె మరకలు తొలిగిపోతాయి.

**గమనిక..**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.